క్లుప్తంగా

విద్యార్థులకు ఆటల పోటీలు

మన్ననూర్: అమ్రాబాద్ మండలం జంగంరెడ్డి పల్లిలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు కోనేరు సంస్థ ఆధ్వర్యంలో గురువారం ఆటల పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో, రన్నింగ్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ రామాంజనేయులు మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు సంస్థ సమకూర్చిన బహుమతులను సర్పంచ్ లక్ష్మమ్మ ఎంపీటీసీ రామాంజనేయులు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ కోఆర్డినేటర్ బాలకృష్ణ, హెచ్ఎం సుష్మ, స్వాతి, పల్లవి, వెంకటేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

మన్ననూర్: అమ్రాబాద్ మండలం తెలుగుపల్లికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు ఆ పార్టీకి రాజీనామా చేసి డీసీసీ అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ సమక్షంలో గురువారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ మేరకు పార్టీలో చేరిన 20 మంది యువకులకు ఆయన పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం అన్నారు. కార్యక్రమంలో నాయకులు హరినారాయణ, రామనాథం, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

బహుమతుల అందజేత

లింగాల: మండల పరిధిలోని అంబట్‌పల్లిలో గ్రామ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు నిర్వహించిన గ్రామ స్థాయి క్రికెట్ పోటీలు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా మొదటి స్థానంలో నిలిచిన రాక్ స్టార్స్ జట్టుకు రూ. 10 వేలు, రెండవ స్థానంలో నిలిచిన ఏపీఎల్ కింగ్స్ జట్టుకు రూ. 5 వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు వైస్ ఎంపీపీ నారాయణగౌడ్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రాథోడ్, నాయకులు అచ్యుతారెడ్డి, ఉప సర్పంచ్ జనార్దన్, వెంకట్‌రాజు, జగదీష్, లింగస్వామి, విష్ణు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నిఖిత కుటుంబానికి న్యాయం చేయాలి

అచ్చంపేట రూరల్: నిఖిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని పలు సంఘాల నాయకులు హెచ్చరించారు. గురువారం పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్, అఖిలపక్షం ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. పలు సంఘాల నాయకులు మద్దతు పలికి మాట్లాడారు. సిట్టింగ్ జడ్జితో అనుమానాస్పద మృతిపై న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు బాలయ్య, లక్ష్మీనారాయణ, అంబయ్య, నారాయణ, అనీల్, రాములు, బాలరాజు, బుచ్చిరాములు, కాశీం, మహేష్ పాల్గొన్నారు.

కాంట్రాక్ట్‌లకు వేతనాలు విడుదల చేయాలి

లింగాల: కాంట్రాక్ట్ ఉపాధ్యాయులకు సకాలంలో వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారని కాంట్రాక్ట్ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నరేష్‌నాయక్, రాష్ట్ర గిరిజన సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డి. తిరుపతయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలలో 65 మంది వరకు కాంట్రాక్ట్ ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు.

బకాయి వేతనాలు మంజూరు చేయాలి

అచ్చంపేట రూరల్: ఆశ్రమ పాఠశాల, హాస్టళ్లలో పని చేస్తున్న బోధనేతర, బోధన సిబ్బందికి వేతనాలు లేక ఇబ్బంది పడుతున్నామని, వేతనాలు మంజూరు చేయాలని డైలీవైజ్ వర్కర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు గోపాల్‌నాయక్, కాంట్రాక్టు ఉపాధ్యాయుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నరేష్‌నాయక్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. జిల్లాలో 158 మంది బోధనేతర, 65 మంది కాంట్రాక్టు ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారని తెలిపారు. ఆరు నెలలుగా జీతాలు లేక ఇబ్బందులు పడుతున్నామని, పండుగకు పస్తులుండాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. అధికారులు వేతనాలు మంజూరు చేయాలని కోరారు.

'స్వప్నాల' వేదిక పుస్తకావిష్కరణ



లింగాల: మండల పరిధిలోని అప్పాయపల్లికి చెందిన రచయిత మంద్రెకారి ఉపేందర్ రచించిన 'స్వప్నాల' వేదిక పుస్తకాన్ని గురువారం ఎంపీటీసీ కాశీనాథం రచ్చకట్ట దగ్గర ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో మంది కవులు, రచయితలు ఉన్నారని, వారికి ప్రోత్సాహం లేక వెలుగులోకి రాలేక పోతున్నారని అన్నారు. ఉపేందర్ రచించిన పుస్తకంలో ఎంతో భావన ఉందని అన్నారు. అనంతరం రచయితను సన్మానించారు. కార్యక్రమంలో పర్వతాలు, మొగుళ్ల కురుమయ్య, మార్కం శివప్రసాద్ పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



కల్వకుర్తిలో విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

ఉప్పునుంతల: కిశోర బాలికలు పోషకాహారం తీసుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు బిపాష, అమృతమ్మ సూచించారు. గురువారం స్థానిక కేజీబీవీ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్షం కార్యక్రమంలో భాగంగా విద్యార్థినులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. చిరు ధాన్యాలు, తృణధాన్యాలు వాడకంతో కలిగే ప్రయోజనాలను వివరించారు. అలాగే సులువుగా జీర్ణమయ్యే తాజా కూరగాయలు, ఆకుకూరలను రోజువారి ఆహారంతో తీసుకోవాలని సూచించారు. మనకు అందుబాటులో ఉండే పాలు తాగడంతోపాటు సీజన్ వారిగా పండ్లు తినాలని చెప్పారు. అనంతరం జాతీయ పోషణ మాసంపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం హన్మంత్ రెడ్డి, కేజీబీవీ ఎస్ఓ సైదా పాల్గొన్నారు.

వెల్దండ: పోషకాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని సూపర్‌వైజర్ శ్రీమతి పేర్కొన్నారు. గురువారం మండలంలో పోషణ పక్షంలో భాగంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంచి పోషక విలువలు ఉన్న ఆహారం తీసుకోవాలన్నారు. అనంతరం మహిళలతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మోడల్ హైస్కూల్‌లోని విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు జ్యోతి, శంకరమ్మ, టీచర్లు మాసమ్మ, మల్లమ్మ, మేర్లీన్, స్వప్న, శివలీల, అలివేలు తదితరులు ఉన్నారు.

కల్వకుర్తి టౌన్: ఎదుగుతున్న కిశోర బాలికలలో పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు పక్కా ప్రణాళికతో సూచనలు, సలహాలు చేస్తున్నామని సీడీపీఓ వెంకటమ్మ అన్నారు. గురువారం పట్టణంలోని కస్తూర్బా గాంధీ, ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్షోత్సవాలలో భాగంగా విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పద్మావతి, లక్ష్మీదేవి, అరుణ, పోషణ్ అభియాన్ వెంకట్, విద్యార్థినులు పాల్గొన్నారు.

మన్ననూర్: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఐసీడీఎస్ అచ్చంపేట ప్రాజెక్టు ఆధ్వర్యంలో విద్యార్థులకు చిరుధాన్యాలు ఆహారంగా తీసుకోవడంతో కలిగే లాభాలను వివరించినట్లు అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సువర్ణ తెలిపారు. గురువారం అమ్రాబాద్ మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాల విద్యార్థులకు సీడీపీఓ దమయంతి సమక్షంలో అవగాహన కల్పించారు. చిరుధాన్యాలు తినడంతో ఐరన్, క్యాల్సియం పెరుగుతుందన్నారు. అదేవిధంగా రక్తపోటు, షుగర్ వంటి జబ్బులను నివారించుకోవచ్చునని తెలిపారు. చిరుధాన్యాలు ఒక్కొక్కటిలో ఒక గుణం ఉంటుందని మూత్ర పిండాల వ్యాధులు, శ్వాస సంబంధిత వ్యాధులు రాకుండా ప్రతి ఒక్కరు చిరుధాన్యాలను ఆహారంగా తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సీడీపీఓ కమల, ఎస్ఓ శారద, సునిత, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బల్మూర్: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో గురువారం పోషణ పక్షంలో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చిరుధాన్యాల ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఎనీమీయా, చిరుధాన్యాలతో కలిగే ప్రయోజనాలు, పరిశుభ్రతతో పాటు ఎస్ఐ కాంపిటేషన్ రైటింగ్ రాయించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు భారతి, నిర్మల, పోషణ అభియాన్ కోఆర్డినేటర్ పార్వతి, అంగన్‌వాడీ టీచర్ నీలాబాయి పాల్గొన్నారు.



వెల్దండలో అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు



చిరుధాన్యాలపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ సువర్ణ

బస్సు యాత్రల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



జనచైతన్య బస్సు యాత్ర వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

నాగర్‌కర్నూల్‌రూరల్: మతోన్మాద కార్పొరేట్ విధానాలను వ్యతిరేకిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న బస్సు యాత్రను జయప్రదం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి జి.అశోక్ పిలుపునిచ్చారు. బస్సు యాత్రకు సంబంధించిన వాల్‌పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. ఈనెల 17 నుంచి 29 తేదీ వరకు జరిగే జన చైతన్య బస్సు యాత్రలో భాగంగా 28న నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ యాత్రలకు విజ్జు కృష్ణన్ హాజరవుతారని అన్నారు. మోదీ, అమిత్‌షాల నేతృత్వంలో కార్పొరేట్ కంపెనీలకు రూ.లక్షల కోట్లు కట్టబెడుతూ ప్రజలపై భారాలను మోపుతున్నారని అన్నారు. ఈ నెల 29న బస్సు యాత్ర జిల్లా కేంద్రానికి చేరుకుంటుందని, బస్సు యాత్రను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో శాఖ కార్యదర్శి రాము, నాయకులు భూషయ్య, శ్రీను, రాజు, కల్యాణ్ పాల్గొన్నారు.

నేడు వాహనాల వేలం

కల్వకుర్తిరూరల్: సారా, నల్లబెల్లం తరలిస్తూ ఎక్సైజ్ అధికారుల దాడుల్లో పట్టుబడిన వాహనాలను శుక్రవారం ఎక్సైజ్ కార్యాలయ ఆవరణలో వేలం వేస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ శంకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 6 ద్విచక్ర వాహనాలు, 4 ఫోర్ వీలర్స్‌ను వేలం వేస్తున్నామని చెప్పారు. వేలంలో పాల్గొనే వారు రూ.10వేలు డిపాజిట్ చేసి పాల్గొనాలని తెలిపారు.

స్మాష్ రాకెట్ నేషనల్ గేమ్‌లో సత్తా చాటిన ఫయాజ్

ఉప్పునుంతల: మండలంలోని తాడూరుకు చెందిన క్రీడాకారుడు ఎండీ ఫయాజ్ ఇటీవల రాజస్థాన్ జైపూర్‌లోని చౌగాన్ స్టేడియంలో ఇటీవల జరిగిన స్మాష్ రాకెట్ నేషనల్ గేమ్‌లో సత్తా చాటి ప్లేయర్ ఆఫ్ ది అవార్డు దక్కించుకున్నాడు. హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్‌గా పీఈటీగా పనిచేస్తున్న ఫయాజ్ ఈనెల 15 నుంచి 17 వరకు మూడు రోజులపాటు జరిగిన స్మాష్ రాకెట్ నేషనల్ గేమ్‌లో తెలంగాణ టీంలో పాల్గొన్నాడు. జట్టు కోచ్ పుల్లి మధు సారథ్యంలో మెయిన్, డబుల్ టీంలో విజయం సాధించారు.

గిరిజనతండాల అభివృద్ధికి కృషి



వెల్దండ మండలం గిరిజనతండాలో వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న రాఘవేందర్‌రెడ్డి

వెల్దండ: గిరిజనతండాల అభివృద్ధికి ఐక్యత ఫౌండేషన్ అండగా ఉంటుందని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని నెమిలిగుండతండా, తూర్పుతండా, పడమటితండాలో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.2లక్షలతో నూతనంగా ఏర్పాటు చేసిన మినరల్ వాటర్‌ప్లాంట్లను ప్రారంభించారు. అదే విధంగా బొల్లిగుట్టతండాలోని ఆంజనేయస్వామి దేవాలయ అభివృద్ధికి రూ.50వేలు అందజేశారు.

చారకొండ: గ్రామాల్లో ప్రజా ఆరోగ్యంపై దృష్టి సారించి, ప్రతిఒక్కరూ స్వచ్ఛమైన నీటిని తాగాలని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అన్నారు. మండలంలోని శేరిఅప్పారెడ్డిపల్లి పరిధిలోని తూర్పు తండా, పడమటి తండా, సోమ్లా తండాలకు కలిపి మంచినీటి సౌకర్యార్థం మినరల్ వాటర్ ప్లాంట్‌ను రూ.1.5లక్షలతో ఏర్పాటు చేసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ తండావాసులకు గతంలో ఇచ్చిన హామీ మేరకు ప్లాంట్ నిర్మించినట్లు తెలిపారు. మంచినీటికి ఇబ్బందిగా ఉన్నా గ్రామాల్లో మరిన్ని ప్లాంట్ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సోమ్లా నాయక్, గోపి నాయక్, లక్ష్మణ్ నాయక్, ఉన్నారు.

అంబేద్కర్ విగ్రహ ప్రతిష్ఠాపనకు భూమిపూజ



తాడూరు: మండలంలోని ఎటిదారిపల్లిలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో గురువారం విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు హర్షణీయమన్నారు. తన వంతు సహాయ, సహకారాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో అంబేద్కర్ కమిటీ అధ్యక్షుడు అర్జున్, ఉపాధ్యక్షులు మల్లేశ్, రమణ, శేఖర్, వైస్ ఎంపీపీ శివలీల, ఉపసర్పంచ్ హనుమంతు, శేఖర్‌గౌడ్, తిరుపతయ్యగౌడ్, రాజు, శంకర్‌గౌడ్, బాలెంకటయ్య పాల్గొన్నారు.

అంబట్‌పల్లిలో ట్రాక్టర్ రివర్స్ పోటీలు

లింగాల: మండల పరిధిలోని అంబట్‌పల్లిలో ఉగాది పండుగను పురస్కరించుకొని గురువారం గ్రామ ట్రాక్టర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ట్రాక్టర్ రివర్స్ పోటీలు రసవత్తరంగా సాగాయి. ఈ పోటీల్లో మొత్తం 12 మంది డ్రైవర్లు పాల్గొన్నారు. మొదటి బహుమతి పుట్ట మధుగౌడ్, రెండవ బహుమతి శ్రీశైలంగౌడ్ పొందినట్లు నిర్వాహకులు తెలిపారు. సింగిల్ విండో చైర్మన్ హన్మంత్ రెడ్డి బహుమతులు పంపిణీ చేశారు.
కార్యక్రమంలో ట్రాక్టర్ యూనియన్ సభ్యులు అతినారపు బాబు, జగదీష్, చంద్రగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ క్యాలెండర్ల పంపిణీ

కొల్లాపూర్: పట్టణంలోని 9వ వార్డులో గురువారం కాంగ్రెస్ పార్టీ క్యాలెండర్లను నాయకులు పంపిణీ చేశారు. ఈ మేరకు కాంగ్రెస్ నాయకులు చింతలపల్లి జగదీశ్వర్‌రావు రూపొందించిన క్యాలెండర్లను వారు ఇంటింటికీ తిరుగుతూ పంచిపెట్టారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే పేద, మధ్య తరగతి ప్రజలకు మేలు జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో మైనార్టీ సెల్ నాయకులు ఎండీ పాష, లతీఫ్, పర్వేజ్ తదితరులున్నారు.



క్యాలెండర్లు పంపిణీ చేస్తున్న నాయకులు

ఆలయ నిర్మాణానికి సహకారం

కోడేరు: మండలంలోని నర్సాయిపల్లిలో గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో గంగమ్మ గుడి నిర్మాణానికి మత్స్యకారులు గురువారం భూమిపూజ చేశారు. త్వరలోనే గుడి నిర్మాణం పూర్తి చేస్తామని అన్నారు. గుడి నిర్మాణానికి ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ మాజీ ఉపసర్పంచ్ గోపాల్, హన్మంతు, కుమ్మరి మల్లేష్, బాలస్వామి, వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ ఆశయాలు కొనసాగిస్తాం

కొల్లాపూర్: స్వాతంత్య్ర సమరయోధుడు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి కార్యక్రమాలను గురువారం నిర్వహించారు. పట్టణంలోని ఆర్‌ఐడీ పాఠశాల వద్ద బీఆర్ఎస్‌వీ ఆధ్వర్యంలో వర్ధంతి ఏర్పాటుచేశారు. అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. భగత్‌సింగ్ ఆశయాలు కొనసాగిస్తామన్నారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి సీపీఎం ప్రజాసంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో శివవర్మ, సలీం, ముంతాజ్‌అలీ, భైరవ, శ్రీకాంత్ తదితరులున్నారు.

అచ్చంపేట రూరల్: స్వాతంత్య్ర పోరాటంలో విద్యార్థి దశ నుంచే పోరాడి దేశం కోసం ప్రాణాలర్పించిన విప్లవ వీరుడు భగత్‌సింగ్‌కు భారతరత్న ఇవ్వాలని వివిధ విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంతో పాటు గ్రామాల్లోని పాఠశాలలు, వివిధ సంఘాల ఆధ్వర్యంలో భగత్ సింగ్ వర్ధంతిని నిర్వహించారు.

తాడూరు: స్వాతంత్య్ర పోరాట యోధుడు భగత్ సింగ్ వర్ధంతిని మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో గురువారం నిర్వహించారు. మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయ సముదాయ ఆవరణలో భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మహమూద్ అలీ, ఆర్ఐ గోపాలకృష్ణ, మండల పరిషత్ సిబ్బంది నరేశ్, ఎండీ హసన్, చంద్రమోహన్, శ్రావన్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు పవన్, నాగమల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

బిజినేపల్లి: భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురు త్యాగాలను ప్రతి విద్యార్థి ఆదర్శంగా తీసుకోవాలని పాఠశాల హెచ్ఎం కొరివి శ్రీధర్ అన్నారు. గురువారం మండలంలోని గంగారం జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో సమరయోధుల వర్ధంతిని నిర్వహించారు. ప్రజా వాగ్గేయకారుడు రాజారాం ప్రకాష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బల్మూర్: దేశం కోసం ప్రాణత్యాగం చేసిన భగత్ సింగ్ వర్ధంతిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రేమ్‌కుమార్ డిమాండ్ చేశారు. మండలంలోని కొండనాగుల ఉమామహేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో భగత్ సింగ్ వర్ధంతిని నిర్వహించారు.



కొండనాగులలో భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు



కొల్లాపూర్‌లో బీఆర్ఎస్‌వీ నాయకులు

అలరించిన ఎడ్ల బండ్ల పోటీలు



బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ వంశీకృష్ణ

పెంట్లవెల్లి: మండల పరిధిలోని జటప్రోలులో ఉగాది పండుగ సందర్భంగా గురువారం గ్రామంలోని రైతులు, గ్రామపెద్దల ఆధ్వర్యంలో ఎడ్ల బండ్ల పోటీలను ఘనంగా నిర్వహించారు. ఈ పోటీల్లో 8 జతల వృషభరాజులు పాల్గొన్నాయి. మొదటి బహుమతి కుమ్మరి గాలెన్న, రెండో బహుమతి కుమ్మరిపెద్ద శ్రీను, మూడవ బహుమతి ట్రాక్టర్ బాలయ్య గెలుచుకున్నారు. అలాగే గ్రామంలో ట్రాక్టర్ల రివర్స్ పందెం పోటీలు నిర్వహించారు. అనంతరం దాతలు మాజీ ఎంపీపీ గోవింద్‌గౌడ్, వైస్ ఎంపీపీ భీంరెడ్డి, మోత్కూరి రాములు విజేతలకు ప్రోత్సహకాలు అందించారు.

మన్ననూర్: అమ్రాబాద్ మండలం ఎల్మపల్లిలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని బండలాగుడు పోటీలను డీసీసీ అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీలలో 12 జతల వృషభ రాజులు పాల్గొన్నాయి. సీబీఎం ట్రస్టు చైర్ పర్సన్, జెడ్పీటీసీ డాక్టర్ అనురాధ మొదటి బహుమతిగా తాడూరు సత్యం రూ. 20,016, రెండవ బహుమతిగా అచ్చంపేట ఎంపీపీ రామనాథం ఎల్మపల్లి బాలయ్య రూ.15,116, మూడవ బహుమతిగా సింగిల్‌విండో చైర్మన్ గణేష్ పాపయ్య రూ.10,116, 4వ బహుమతిగా లింగాల సైదులుకు దుడ్డు పాపయ్య రూ.5వేలు అందజేశారు.

'కంటివెలుగు'ను సద్వినియోగం చేసుకోండి



కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కల్పన

కందనూలు: అర్హులైన ప్రతిఒక్కరూ కంటివెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కల్పన అన్నారు. గురువారం మున్సిపల్ పరిధిలోని 18వ వార్డులో కంటివెలుగు శిబిరాన్ని వార్డు కౌన్సిలర్ జక్క రాజ్‌కుమార్‌తో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిందని, కంటి సమస్యలు ఉన్న ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

కల్వకుర్తిరూరల్: కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ఆంజనేయులు, సర్పంచ్ పాండుగౌడ్ కోరారు. గురువారం మండలంలోని తర్నికల్‌లో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ కంటి సమస్యలు ఉన్న ప్రతి ఒక్కరు శిబిరంలో పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి హారణి, సురేశ్‌గౌడ్, భీరయ్య, మహేశ్, వెంకటేశ్, భానుచందర్ పాల్గొన్నారు.

జనచైతన్య యాత్ర పోస్టర్ల విడుదల



ఎన్మన్‌బెట్లలో పోస్టర్లు విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

బల్మూర్: ఈనెల 28న నాగర్‌కర్నూల్‌లో జరిగే సీపీఎం జనచైతన్య యాత్ర వాల్ పోస్టర్లను గురువారం మండలంలోని కొండనాగులలో ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి శంకర్‌నాయక్ విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్, గంగయ్య, లక్ష్మయ్య, శంకచర్య, రమేష్, రైతులు పాల్గొన్నారు.

జన చైతన్య యాత్ర పోస్టర్లు విడుదల

కొల్లాపూర్ రూరల్: మండల పరిధిలోని ఎన్మన్‌బెట్లలో సీపీఎం ఆధ్వర్యంలో ఏప్రిల్ 5న పార్లమెంట్ ముట్టడిని జయప్రదం చేయాలని ఆ పార్టీ నాయకులు తెలిపారు. ఈ మేరకు స్థానికులతో కలిసి పోస్టర్లు విడుదల చేశారు. అనంతరం సీపీఎం మండల నాయకుడు సురేందర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా రైతులను, కార్మికులను, కర్షకులను ఏకం చేస్తున్నామన్నారు. ప్రజను చైతన్యం చేసేందుకు యాత్రల పోస్టర్లు ప్రతి గ్రామంలో విడుదల చేస్తున్నామని అన్నారు.

చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలి



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

తాడూరు: మండలంలోని అంతారం ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో గురువారం పాఠశాల వార్షికోత్సవ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని అలరించాయి. ఈ సందర్భంగా ఎంఈఓ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం శేషగిరి, సర్పంచ్ జయమ్మ, మాజీ సర్పంచ్ చిన రాములు, విద్యాకమిటీ చైర్మన్ కృష్ణయ్య, ఉపాధ్యాయులు బాలరాజు, రాఘవేందర్, సమీనా భేగం, చెన్నయ్య, ఉపసర్పంచ్ శాంతయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ



ప్యాడ్లు పంపిణీ చేస్తున్న జనార్దన్‌రెడ్డి

కల్వకుర్తిరూరల్: విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నతంగా ఎదగాలని పీఏసీఎస్ చైర్మన్ తలసాని జనార్దన్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని గిరిజన గురుకుల పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. ఈ మేరకు దివంగత మాజీ ఎమ్మెల్యే ఎడ్మ కిష్టారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులంటే ఆయనకు ఎంతో ఇష్టమని, తనవద్దకు వచ్చిన ప్రతి ఒక్కరికి సహాయ సహకారాలు అందించారని చెప్పారు. ఆయన జయంతి సందర్భంగా పరీక్ష ప్యాడ్లు అందించామన్నారు. కార్యక్రమంలో ఆనంద్‌గౌడ్, ఉపాధ్యాయులు ఉన్నారు.

కిచెన్ గార్డెన్‌లతో ఖర్చులు ఆదా



కిచెన్ గార్డెన్‌లపై అవగాహన కల్పిస్తున్న రావేఫ్ విద్యార్థులు

బిజినేపల్లి: గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు ఇంటి పరిసరాల్లో కిచెన్ గార్డెన్‌లు ఏర్పాటు చేసుకుంటే ఇంటి ఆహార ఖర్చులు ఆదా చేయవచ్చని రావేఫ్ విద్యార్థులు అన్నారు. గురువారం తిమ్మాజీపేట మండలంలోని ఆవంచలో ప్రత్యేక జాతీయ సేవా శిబిరం కార్యక్రమంలో భాగంగా మహిళలకు కిచెన్ గార్డెన్, క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు వేసవి కాలంలో కొంత సమయం క్రీడలకు కేటాయించాలన్నారు. తద్వారా మానసిక ఉల్లాసం, ఆలోచన తీరు పెరుగుతుందని వివరించారు. అంతేకాకుండా వేసవిలో మహిళలు తమ ఇంటి అవసరాల ఖర్చులు తగ్గించుకోవడానికి పెరటిలో కూరగాయలు, ఆకు కూరలు ఏ విధంగా పెంచుకోవాలో వివరించారు. అంతేకాకుండా వృథా నీటితో కూడా కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం ప్రశాంత్‌కుమార్, బాలకృష్ణ, గాయత్రి, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

కొల్లాపూర్: ఆర్టీసీకి సంబంధించిన సమస్యలు, సలహాల స్వీకరణ కోసం శుక్రవారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ రాజేశ్వర్ వెల్లడించారు. సెల్ నంబర్.9000405878కు ఫోన్‌చేసి సమస్యలు, సలహాలు తెలియజేయాలన్నారు.